

కథా కౌముది

# ధర్మ సమ్మూఢ చేతాఃపృచ్ఛామి - బి. గీతిక

వంగూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన "మొట్టమొదటి అంతర్జాతీయ తెలుగు రచయిత్రుల కథల పోటీ" లో బహుమతి పొందిన కథ.

**మంచు తుంపరల్లా** మొదలైన చినుకులు క్రమేపీ పెద్దవవుతూ లయతో కూడిన శబ్దం చేస్తున్నాయి. దారి ప్రక్కలనున్న మట్టిలోంచి సన్నటి నీటిపాయ ఉరకలేస్తూ ముందుకు పారుతోంది. అదో గమ్యం తెలీని ప్రయాణం...పల్లాన్ని వెతుక్కుంటూ.

వాలుగా పడుతున్న చిరు చినుకులు అప్పుడొకటి అప్పుడొకటి వచ్చి బాల్కనీలో కూర్చున్న నన్నూ తడుపుతున్నాయి. వాటికి తోడుగా రివ్వున గాలి. కానీ ఇవేవీ నా ఆలోచనల్ని ఆపలేకపోతున్నాయి.

జడ్జిగా ఉన్న నా ఇన్నేళ్ళ సర్వీసులో ఇలాంటి కేసుని నేనెప్పుడూ చూడలేదు. నాకే కాదు...ఎవరికీ ఇలాంటి కేసు అనుభవంలోకి వచ్చి వుండదు. సంకట స్థితి అన్న మాటకర్థం ఇప్పుడు బాగా తెలుస్తోంది నాకు.

ఎవరయినా నష్టపోయినప్పుడు, దెబ్బతిన్నప్పుడు, మోసపోయినప్పుడు, ఇలా వివిధ కారణాలతో కోర్టుకు వస్తారు. కానీ ఇలాంటి విషయంలో కూడా న్యాయం కోసం కోర్టుకి వస్తారా...? అదీ ఒక జంతువు మీద...!

కింది కోర్టుల్లోలాగానే జంతువు మీద కేసేంటని నేనూ కేసును కొట్టివేసేదాన్నే. కానీ అతను పిటీషన్‌లో పేర్కొన్న కారణం నన్ను ఆలోచింపజేసింది. ఆ పిటీషన్‌లో అతను చెప్పిన కారణం...

*మేం కోర్టుకు ఎందుకు వస్తాం...న్యాయం జరగాలనే కదా. ఇక్కడ న్యాయం అంటే ఏంటి? నా తరఫు మనిషిని ఎవరో చంపారు...లేదూ రేప్ చేశారు. దానికి మీరిచ్చే న్యాయం వల్ల చనిపోయిన వా ళ్ళు లేచొస్తారా? రేప్ కాబడ్డ వాళ్ళ శీలం తిరిగొస్తుందా? అవేవీ రావు. మీరు వాళ్ళకి వేసే శిక్షను బట్టి మా మనసుకు తృప్తి కలుగుతుంది. మరి నా మనసుకి ఎలా తృప్తి కలుగుతుంది? నేను దాన్ని చంపితే న్యాయపరంగా తప్పు. మరి మీరూ శిక్ష వేయక, నేనూ శిక్షించక...కన్న బిడ్డను పోగొట్టుకున్న నా మనసు శాంతించేదెలా...?'*

ఇవీ...ఆ పిటీషన్‌లోని వాక్యాలు

అతని బాధ నాకర్థమైంది.

ఎన్నో కేసులకి తీర్పులిచ్చాను మరింకెన్నో కేసుల్ని, తీర్పుల్నీ చూశాను కోర్టుకు వచ్చేవాళ్ళందరూ న్యాయం చెయ్యమనే వస్తారు. చాలా కేసుల్లో న్యాయమంటే వాళ్ళకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దమని కాదు. తమకు అన్యాయం చేసిన వాళ్ళను శిక్షించడమే న్యాయమంటే వాళ్ళ దృష్టిలో ఆ శిక్షను చూసి సంతృప్తి చెంది వాళ్ళకు జరిగిన అన్యాయాన్ని మర్చిపోతారు. కొన్ని కేసుల్లో వాళ్ళకు

కావాల్సిన న్యాయం ఆస్థి పరంగా ఉన్నా ఎక్కువ కేసుల్లో ఆత్మ తృప్తే వారు కోరుకునే న్యాయం అందుకే కేసును మేజిస్ట్రేట్ కోర్టులాగా కొట్టివేయలేకపోయాను.

ఇది ఒక కారణమైతే, ఇంకో కారణం అతని గుండె కోతని నేను అర్థం చేసుకోగలను...ఎందుకంటే నాదీ అదే పరిస్థితి కాబట్టి. అతని కూతురు శాశ్వతంగా దూరమై పోతే, నా కొడుకు ఇంత విశాల భారతావనిని కుగ్రామమనీ, ఇక్కడుండలేననీ, విదేశాల బాటపట్టాడు. అందులో నా తప్పూ ఉంది. ఉన్నత విద్య కోసం వాణ్ణి నేనే ఎబ్రాడ్ పంపాను. వాడికక్కడి పైపై మెరుగులు నచ్చి ఈ పూర్ ఇండియాకి రానన్నాడు.

కానీ...అతను. ఆమె చేసిన తప్పేంటి...? వాళ్ళకెందుకీ శిక్ష...?

వాళ్ళ తప్పేంలేదనేగా నాకింత ధర్మ సంకటం. తప్పంతా ఆ ఆంబోతుదే కానీ వాళ్ళకి న్యాయం చేసేదెలా...?

అంతులేని ప్రశ్నలతో మెదడు వేడెక్కడం తెలుస్తోంది... అంతటి చలిలోనూ...!

*నాకింత అన్యాయం జరిగితే కోర్టుకి కాకుండా ఎక్కడికి వెళ్ళగలను...? కోర్టులోనే నాకు న్యాయం దొరక్కపోతే ఇంకెక్కడ వెదకను దాన్ని...?* దీనంగా అడుగుతున్న అతని రూపంతోపాటూ కేస్ షీట్లోని విషయాలు ఉదయం జరిగిన ఆర్గ్యుమెంట్ కళ్ళముందు మెదిలాయి.

ఈ కేసులో వాది భరత్ విజయవాడలోని ఒక వ్యాపారవేత్త. అతనికి పెళ్ళైన ఐదేళ్ళకి లేక లేక పుట్టిందట దివ్య. పాపకి నిండా రెండేళ్ళైనా నిండకుండానే ఓ రోజు... వాకిట్లో ఆడుకుంటున్న పాపాయిని ఓ ఆంబోతు కొమ్ములతో కుమ్మి రోడ్డు మీదకి ఈడ్చుకొచ్చి చీల్చి చెండాడిందట.

కావాల్సినంత ఆస్థి అంతస్తులున్నా అనుభవించడానికి బిడ్డలు లేరు. ఇందులో తప్పెవరిది? ఆ దుఃఖం నుంచి బయటపడి 'ఇలాంటి పరిస్థితి'. 'ఈ గుండె కోత' మరో 'కన్న గుండె'లకి వద్దు. ఇలా ఇంకెవరూ బలి కారాదంటూ ఆ ఆంబోతు మీద కేసు వేశాడట భరత్.

కేసు కింది కోర్టులన్నిట్లోనూ కొట్టివేయబడి ఇప్పుడు ఈ జిల్లా కోర్టుకు వచ్చింది. మొదటి విచారణ జరిగిన రోజు నాకు బాగా పరిచయస్తుడైన మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి ఫోన్ చేసి, 'చందన గారూ...ఇది పెద్ద విషయమా...? దీనికి మానవ మాత్రులం మనమేం చెయ్యలేం...' అనడం నాకింకా గుర్తే.

ఆ సంఘటన జరిగినప్పుడు ప్రత్యక్షంగా ఆ ఇంటి చుట్టుపక్కల వాళ్ళు కోర్టులో సాక్ష్యం చెప్పడానికి వచ్చి... 'అంతా శివుడాజ్ఞ నందీశ్వరుడు ఎందుకిలా చేశాడో...' అనడం నన్ను విస్మయానికి గురిచేసింది.

కేసులో ప్రతివాది ఆంబోతు తరఫున వాదించడానికి పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేయాల్సివచ్చింది. వాయిదాలు, విచారణలు ఈ రోజుతో పూర్తయ్యాయి. రెండు వైపుల వారూ చాలా బలంగా వాదించారు. ఇద్దరి వాదనల్లోనూ అర్థముంది. వారి వాదనలు చెవుల్లో ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయింకా.

'యువరానర్..! ఆ ఆంబోతు మూగప్రాణి. దానికి నోరు లేదు. దాని వాదన చెప్పుకోలేదు. దానికి న్యాయం జరగడం కోసం...' పబ్లిక్ ప్రాసిక్యూటర్ మాటలు పూర్తి కాకుండానే భరత్ తరఫున లాయర్ రత్నశేఖర్ ఖంగున గొంతు విప్పాడు.

'అది మూగప్రాణి. చెప్పుకోలేదు. మరి మనిషికి నోరుంది. బాధ చెప్పుకుంటున్నాడు. నా క్లయింట్ చెప్పుకుంటున్నదీ అదే ఐదేళ్ళ తర్వాత లేక లేక పుట్టిన తన కూతురి హత్య ఆయనకి తీరని దుఃఖమే. మరి నోరు తెరిచి బాధని చెప్పినా ఈ సమాజం పట్టించుకోవట్లేదని మనం మర్చిపోతున్నాం. అంటే చెప్పుకున్నా ఉండని రక్షణ, అభయం చెప్పుకుంటే వస్తుందన్నమాట. ఎంత

హాస్యాస్పదం!అడగందే అమ్మైనా పెట్టదంటారు. కానీ మీరు అడక్కపోతేనే న్యాయం చెయ్యాలన్నట్లు మాట్లాడుతున్నారు.' పి.పి వంక చూస్తూ అడిగాడు రత్నశేఖర్.

'అయితే మీరేమంటారు? పాపపోయిందని, హత్య చేసిన నేరానికి ఆంబోతుని వధించమంటారా? అప్పుడు దానికీ మనకీ తేడా ఏముంది? ఒక జీవిని చంపడం పాపం కదా?' పబ్లిక్ ప్రాసిక్యూటర్ పాప పుణ్యాల గురించి చెప్పబోయాడు.

'పాపమా! అవి మనుషుల్ని చీల్చి చంపడం పాపం కాదు. కానీ అవి చేసిన తప్పుకి మనం శిక్షించడం మాత్రం పాపమా.?' రత్నశేఖర్ ఆవేశంగా అడిగాడు.

'పా పమే. వాటికి బుద్ధీ జ్ఞానం విచక్షణ లేవు. మనకా విచక్షణుంది...'

'అవును...ఉంది కాబట్టే వాటికున్న విలువ కూడా మనకి లేదు. ఒక జంతువు మనిషిని చంపితే పట్టించుకోం మనం. అదే..మనిషి జంతువుని చంపితే ఆ మనిషిని శిక్షించే వరకూ వదలం. మూగజంతురక్షణ. కారుణ్య సంఘం అంటూ మనిషిని కుళ్ళబొడుస్తాం. యువరానర్! మనం ఒక పశువుని కాపాడాలని చూస్తాం. ఒక పులి, జింక, ఏనుగు...ఏదైనా అవ్వచ్చు. కానీ అవి? మొన్నటికి మొన్న ఎక్కడో కాదు...మన రాష్ట్రంలోనే ఏనుగుల గుంపు పన్నెండు మందిని కిరాతకంగా చంపేసినా వాటి రక్షణ గురించే ఆలోచించాం. చనిపోయిన ఆ పన్నెండు మంది కుటుంబాల అగచాట్లు, ఆవేదనలు ఆలోచించామా? వాళ్ళేమైపోతే మనకెందుకు? మనం మాత్రం ఆ ఏనుగుల పోషణకి లక్షలు లక్షలు ఖర్చుపెట్టాం. తోటి మానవులకి ఏం జరిగినా చలించకుండా ఉండడమేనా మనకున్న బుద్ధీ, జ్ఞానం విచక్షణ? ఇంటికి మగదిక్కు పోయాక ఆ కుటుంబానికి,అతని భార్యపిల్లలకి దిక్కెవరు? అలాంటి పన్నెండు కుటుంబాల్లోని దు:ఖం మనకనవసరం. ఆ అభాగ్యపిల్లల బతుకులు ఏమైపోయినా మనకనవసరం. ఆహారం కోసం కాదు యువరానర్... పొగరెక్కి జనాల మీద పడి ఊళ్ళు నాశనం చేస్తే, వాటి తప్పేం లేదు. వాటి కోసం లక్షలు వెచ్చించాం. అదే చూసీ చూడకో తెలిసీ తెలీకో ఒక్క మృగాన్ని చంపామో... అది నేరం. ఘోరం. ఏళ్ళ  తరబడి విచారించి శిక్షిస్తాం. ఇదేనా న్యాయం? ఒక్క జంతువు కున్న విలువ ఇంత ఆలోచన, మేధాశక్తి ఉన్న మానవుడికి లేదా!? మన చట్టంలో మనుషులు జంతువుని చంపితే తప్పు. జంతువులు మనుషుల్ని చంపితే తప్పుకాదు. ఇదేగా యువనార్.. సోకాల్డ్ న్యాయం?' ఆవేశంగా అడుగుతున్న రత్న శేఖర్ గొంతు బొంగురుపోయింది.

చివర్న బెంచీల మీద కూర్చున్న వారిలో కలకలం... గుస గుసలు...

'ఆర్డర్...ఆర్డర్...' అని 'మీరు చట్టాన్ని అవమానిస్తున్నారు.' అంటూ హెచ్చరించక తప్పలేదు జడ్జినైన నాకు.

కేసు గురించి మీడియాలో చూసీ, ఆ నోటా ఈ నోటా వినీ వచ్చిన చాలా మంది జూనియర్ లాయర్లూ, ప్రజలతో కోర్టు నిండిపోయింది. కోర్టు  సమయం అయిపోవడంతో కేసుని రెండు రోజుల తర్వాతకి వాయిదా వెయ్యాల్సొచ్చింది జడ్జిమెంట్ కోసం.

●●●

రెండు రోజులూ నా మనసులో ఈ కేసు గురించే ఆలోచనలు.

ఈ రోజే...ఆంబోతు కేసు జడ్జిమెంట్...!

అంతటా అదో క్యూరియాసిటీ. పసిపాపని చంపిన నేరానికి ఆంబోతుని శిక్షిస్తారా? శిక్షిస్తే ఏం శిక్ష విధిస్తారు?యావజ్జీవమా?ఉరిశిక్షా?' ఇదే చర్చ.

ఈ శిక్షలతో, కోర్టువాయిదాలతో ఏ మాత్రం సంబంధం లేనట్టు ఆ ఆంబోతు ధీమాగా, హాయిగా జైల్లో గడ్డి నములుతూ కూర్చుంది ఇన్ని రోజులూ...!

●●●

ఉదయం పది గంటలవ్వస్తున్నా ఇంకా ఎండ రాలేదు. అల్పపీడనం! నలభై ఎనిమిది గంటల వరకు భారీ వర్షాలు కురవొచ్చని హెచ్చరికలు జారీ చేశారు.

దాని తాలూకు మబ్బు దట్టంగా కమ్మి ఇంకా చీకటి అనిపించేలా ఉంది.

పోర్టికోలోంచి తీసిన కారుని రివర్స్ చేసి కోర్టు వైపు పోనిచ్చాను.

కోర్టు నా హోదాకు నియమించిన అమీనా గేటు వెయ్యడం, గేటు ప్రక్కన 'జడ్జి చందన' అన్న నేం ప్లేట్..కారు మిర్రర్లోంచి కనిపిస్తుంటే ఆలోచనల్నిండా కోర్టుని, ఈ రోజు కేసుల్ని నింపుకుని కారుని ముందుకు దూకించాను.

నా జడ్జి జీవితంలో ఓ కేసు తీర్పు కోసం వచ్చిన ఇంతమంది జనాన్ని ఎప్పుడూ చూడలేదు నేను. విశేషం ఏమిటంటే...ఏ తీర్పుకైనా ముద్దాయి సంబంధిత బంధువులో, మిత్రులో, ఆప్తులో వస్తుంటారు. కానీ ఈ కేసుకు వచ్చినవారిలో చాలా మంది వాది, ప్రతివాదులిద్దరికీ సంబంధించిన వారు కాదు. అసలు వారితో ఏ సంబంధమూ లేని వారే...!

కళ్ళజోడు సరిచేసుకుని, నేను వ్రాసుకున్న పాయింట్లున్న పేపర్ని చేతిలోకి తీసుకున్నాక, అలవాటుగా ఏకాగ్రతగా జడ్జిమెంట్ చెప్పడంలో నిమగ్నమయ్యాను.

'కేసు వాదోపవాదాలు విన్న తర్వాత తప్పు ముమ్మాటికీ ఆంబోతుదేనని కోర్టు నమ్మింది. చిన్నారి దివ్య మరణం మనలోని మానవత్వానికే సవాలయ్యింది. వాది భరత్, అంజుశ్రీలకి కోర్టు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తోంది.

ఒక చోట ఏనుగులు భీభత్సం చేశాయని. మరో చోట పులులు మనుషులపై దాడి చేశాయని ఆ సంఘటనల్ని ఈ తీర్పులో పరిగణనలోకి తీసుకోలేం. ఈ కేసులో దోషి ఆంబోతే. దాన్ని శిక్షించాల్సిందే. కానీ శిక్షించే ముందు మానవులుగా, మానవత్వం నిండినవారిగా ఆలోచించాలి మనం.

బుద్దీ, జ్ఞానం, విచక్షణ ఉన్న మానవుడ్ని శిక్షిస్తే అది ఒక మార్పు తెస్తుంది. అది తప్పని, మరలా ఆ పని చెయ్యకూడదనీ, ఒకవేళ అలా చేస్తే శిక్ష పడుతుందనీ మిగిలిన మనుషులందరూ గ్రహిస్తారు. మరి ఈ పశువుని శిక్షించడమో, ఉరివేయడమో చేసినంత మాత్రాన మిగిలిన అన్ని పశువులూ ఇలా చెయ్యకూడదని తెలుసు కుంటాయా? ఇవన్నీ జరగనప్పుడు, దాన్ని శిక్షించీ ప్రయోజనమేంటి...?' ఎమోషనల్‌గా బాగా ఇన్వాల్వ్ అయ్యానేమో ఒక్క క్షణం ఏమీ మాట్లాడలేక పోయాను.

ఆ ఒక్క క్షణంలోనే అందర్లో ఆలోచన ...కలకలం. 'ఇక ఆంబోతుని శిక్షించరేమో' అన్న నమ్మకం.

నేను నా తీర్పుని కొనసాగించాను.

'మనం మానవులం. అపారమైన మేథస్సు కలిగినవారం. ఈ భూమి మీద ఉన్న జీవరాశుల్నీ, పర్యావరణాన్నీ కాపాడవలసిన అవసరం ఉంది. అదీ మనకోసమే. మన మనుగడకు ముప్పు రాకూడదనే.

పర్యావరణంలోని సమతుల్యత చెడగొడుతున్న మనకి దాన్ని సరిచేయవలసిన బాధ్యత కూడా ఉంది. అందుకోసమే చట్టం మూగజీవుల పట్ల కాఠిన్యత వద్దంది. అంతరించిపోతున్న జాతుల మనుగడని రక్షించడం కోసం వాటికి అపకారం తలపెడితే శిక్షల్ని వేస్తోంది. అంత మాత్రాన మనిషికి విలువ లేదని కాదు.

అందువల్లనే...ఈ కేసులో దోషి ఐన ఆంబోతుని శిక్షించడంలోనూ మానవులంతా మానవతా దృష్టితో ఆలోచించి తీర్పు ఇవ్వడమైనది. ఆంబోతును అటవీ శాఖకు అప్పగించి దాన్ని దూరంగా దట్టమైన అరణ్యంలో వదిలి రమ్మని శిక్ష విధించడమైనది. ఇందుకు అవసరమైన కార్యనిర్వహణకు అటవీశాఖ అధికారులకి జారీ చెయ్యడమైనది...'

నాలో నాకే ఏదో లోటు...‘నేను దివ్య తల్లిదండ్రులకి న్యాయం చెయ్యగలిగానా...?‘ నిన్నట్నుండీ ఇదే అంతర్మథనం. ఈ కేసుకి తీర్పు ఇచ్చి పది గంటలు దాటింది. ఒకసారి జడ్జిమెంట్ అయిపోయాక ఆ కేసు గురించి పది నిముషాలైనా తిరిగి ఆలోచించని నేను... ఇదే కేసుని మొదటినుంచీ ఇదే తీవ్రతతో ఇంకా...ఇంకా ఆలోచిస్తూనే... ఊహు... మథనపడుతూనే వున్నాను.

బిడ్డ ఉన్నా కంటికి, చేతికి అందనంత దూరంలో ఉండి ఒంటరిగా బతుకుతున్న దాన్ని. పేగుతీపి, ఆ వియోగంలోని చేదు, రెండూ నాకు బాగా తెలుసు. అందుకే నేమో నాలో ఈ సంఘర్షణ...!

నా ఆలోచనలు సాగుతూనే ఉన్నాయి. కానీ...వాటన్నిలో ఒకటే ప్రశ్న...‘నేను న్యాయం నిలబెట్టానా...?‘

‘మనిషికి మనిషే న్యాయం చేసుకోలేక పోతున్నామా...!‘

●●●

**Click here to share your comments on this story**